ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 21 జూలై 2024



మల్హర్ మండలం తాటిచర్ల ఓసీపీలోకి చేరిన వరద నీరు

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం


భూపాలపల్లిటౌన్, జూలై 20: భూపాలపల్లి మండలంలోని సింగరేణి ఓపెన్‌కాస్టు 2, 3లలో వర్షం కారణంగా అధికనీరు చేరి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో 6,385 టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. మల్హర్ మండలంలోని తాడిచర్ల బ్లాక్ ఓసీలోకి వర్షం నీరుచేరి 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. మొత్తం బొగ్గు గనులకు సుమారు రూ.4.50 కోట్ల మేరకు నష్టం జరిగి ఉంటుందని సింగరేణి అధికారులు తెలిపారు.



మహదేవపూర్ మండలం కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం



కాటారం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బొర్రవాగు



బయ్యారం మండలంలో అలుగుపోస్తున్న బీఎన్.గుప్తా తులారాం ప్రాజెక్టు



కాటారం మండలం గంగపురిలో పెద్దవాగు పొంగి నీట మునిగిన పత్తిపంట

ముసురుకుంది..

- ములుగు, మహబూబాబాద్ జిల్లాలో పొంగుతున్న వాగులు
- పలుచోట్ల నీటమునిగిన పంటలు, కూలిన చెట్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం.. ఇబ్బంది పడ్డ జనం..
- రామప్ప, లక్నవరం, పాకాల చెరువులకు జలకళ
- గోదావరి నదికి పెరుగుతున్న ప్రవాహం
- బ్యారేజీలకు కొనసాగుతున్న వరద ఉధృతి
- భూపాలపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- అప్రమంత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ఆయా జిల్లాలో టోల్‌ఫ్రీ నెంబర్ల ఏర్పాటు



20.9 అడుగులకు చేరిన పాకాల నీటిమట్టం

• ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వానలు •

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/ జనగామ (ఆంధ్రజ్యోతి)/ ములుగు/ భూపాలపల్లి టౌన్ / వరంగల్ వ్యవసాయం, జూలై 20: అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. శనివారం రోజంతా ముసురు కమ్మింది. ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు కొంత అసౌకర్యం ఏర్పడింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు వరద నీటితో కళకళ లాడుతున్నాయి.

- ములుగు జిల్లాలో 30 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వానకు ఈదురుగాలులు తోడవ్వడంతో ఏటూరునాగారం-తాడ్వాయి, తాడ్వాయి-మేడారం ప్రధాన దారిలో చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు స్థానికుల సహకారంతో చెట్లను తొలగించి పునరుద్ధరించారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పదికిపైగా అటవీ గ్రామాలకు రెండురోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలకోసం ఎలిశెట్టిపల్లి, కొండాయి వద్ద మరపడవలను అధికారులు అందుబాటులో ఉంచారు. చెరువులు, కుంటలలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన వృద్ధురాలు మాదరి పోచమ్మకు ఫిట్స్ రాగా మండలకేంద్రంలోని ఆస్పత్రికి తీసుకురావడానికి ప్రయత్నించారు. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎయిర్ బోట్ ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆమెను వాగు దాటించింది. అక్కడ నుంచి ఆమెను 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే భారీ వర్షాలకు బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. జంపన్నవాగుపై కల్వర్టుల వద్ద ఉధృతి ఎక్కువగా ఉండగా ప్రజలు ఎవరూ దాటకుండా పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. 33.6 మీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన లక్నవరం సరస్సులోకి ప్రస్తుతం 19ఫీట్లకు నీరు చేరింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం అతలాకుతలం అవుతున్నారు. జిల్లాలో సగటు వర్షపాతం 25.8 మిల్లీ మీటర్లు నమోదైంది. భారీ వర్షాలకు పలు చోట్ల చెరువులు, కుంటలకు మత్తడిపోస్తుండగా వాగులు ఉప్పొంగాయి. మహదేవపూర్, పలిమెల ప్రాంతంలోని గోదావరి ఐదు మీటర్ల ఎత్తులో, 3లక్షల 73వేల కూసెక్కుల నీటితో ప్రవహి స్తోంది. మల్హర్, కాటారం మీదుగా వెళ్లే మానేరు నది కూడా వర్షాల కారణంగా ఉప్పొంగింది. కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి మైసమ్మకుంట మత్తడి తెగిపోయింది. తూము దగ్గర బుంగపడటంతో పంటపొలాలు మునిగిపోయాయి. శంకరంపల్లిలో కూలీపనిచేసే శ్రీనివాస్ ఇంటిపైకప్పు కూలిపోయింది. పోతులవాయి, బొర్రవాగు, గంగారం అలుగువాగు ఉప్పొంగాయి. మల్లారం మిడిచెరువు అలుగు

మిగతా 7వ పేజీలో..



మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

- 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

7

మేడారం ప్రధాన పూజారి మృతి



పూజారి ముత్తయ్య (ఫైల్)

మేడారం, జూలై 20 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య(50) శని వారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. డిశ్చార్జ్ అయ్యాక తీవ్ర అస్వస్థతకు గురైన అయన శనివారం ఉదయం మృతి చెందారు. ముత్తయ్యకు భార్య నాగమణి, కూతురు సాయిప్రసన్న, కొడుకు సాయిచరణ్ ఉన్నారు. ముత్తయ్య మృతి పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మేడారం మహాజాతరలో వనదేవతలను గద్దెలకు తీసుకొచ్చే క్రమంలో సమ్మక్క పూజా కార్యక్రమాల్లో ముత్తయ్య కీలకపాత్ర పోషించేవారు. జాతర సమయంలో మహాఘట్టం ప్రారంభం నుంచి చిలకలగుట్ట పైకి వెళ్లి కుంకుమ భరణి తీసుకురావడం, దేవతను వనప్రవేశం తదితర కార్యక్రమాల్లో పాల్గొనే వారు.

గంజాయి కేసులో 8 మంది అరెస్టు



నిందితుల అరెస్టును చూపిస్తున్న సీఐ, ఎస్సై

వాజేడు, జూలై 20: గంజాయిని తాగుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారిలో ఐదుగురు మైనర్లు ఉన్నారు. వెంకటాపురం(నూగూరు) సర్కిల్ సీఐ బండారి కుమార్ శనివారం ఆ వివరాలను వెల్లడించారు. పేరూరు స్టేషన్ పరిధిలోని చంద్రుపట్ల గ్రామ శివారులో గంజాయి తాగుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, సివిల్ పోలీసులు అక్కడకు వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడ్డ వారిలో మండలంలోని టేకులగుడెం గ్రామానికి చెందిన జవ్వా గణేష్, భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కనుకునూరుకు చెందిన మారబోయిన శివరామకృష్ణ, దాట్ల శ్రవణ్‌కుమార్‌తో పాటు మరో ఐదుగురు మైనర్లు ఉన్నారు. వీరి వద్ద నుంచి సుమారు 168 గ్రాముల గంజాయి, ఏడు స్మార్ట్ ఫోన్లు, ఒక కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం(నూగూరు), జూలై 20: గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) మృతదేహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి రేవు సమీపంలో శనివారం లభ్యమైంది. కుటుంబ సభ్యులు సున్నంబట్టిరేవు గ్రామానికి వెళ్లి రాజు మృతదేహాన్ని గుర్తించి స్వగ్రామానికి తరలించారు.

భూపాలపల్లి కలెక్టరేట్ ఏవో బదిలీ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 20: కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు బదిలీ అయ్యారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగేళ్లకు పైగా ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న మహేష్‌బాబును ములుగుకు బదిలీ చేశారు. మల్టీ జోన్-1 తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టారు.

ఇదేమిటబ్బా!

- 'రామప్ప'లో వర్షపు నీరు చేరడంపై పర్యాటకుల ఆందోళన
- లీకేజీ కావంటున్న అధికారులు
- ఈదురుగాలులకు జల్లులు లోపలికి వస్తున్నాయని వివరణ
- సమస్యను పరిష్కరించేందుకు సన్నద్ధం!
- అరుదైన రాళ్లతో మరమ్మతులు
- సాంకేతిక పరిజ్ఞానంతో ఐరన్ క్లిప్‌ల ఏర్పాటు



రామప్ప ఆలయంలో కక్షాసన ప్రదేశంలో పడుతున్న వర్షపు నీరు

వెంకటాపూర్(రామప్ప), జూలై 20 : రామప్ప దేవాలయం భారీ వర్షానికి కురుస్తుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన ఆలయంలో ఇలాంటి పరిస్థితులు చోటుచేసుకోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆలయ పైకప్పులోని సజ్జల్ స్టోన్‌లో ఏర్పడ్డ సందుల నుంచి నీటి చుక్కలు కిందికి కారుతున్నాయి. రెండుచోట్ల చూరు నుంచి, రాతి స్తంభాల నుంచి కక్షాసన ప్రదేశంలోకి చేరుతోంది. ఈ దృశ్యాన్ని చూసి పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం 2022 జూలైలో భారీ వర్షానికి ఇదే తరహాలో పైకప్పు కురిసింది. ఈ నేపథ్యంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్మిత ఎస్ కుమారి బృందం రామప్పను సందర్శించింది. ఇవి లీకేజీలు కావని, రామప్ప ఆలయ నిర్మాణం మూడు వైపులా తెరుచుకోని ఉండటంతో వర్షం నీరు లోపలికి వస్తోందని, సజ్జల్ స్టోన్‌లో ఏర్పడ్డ సందుల ద్వారా నీరు ఆలయంలోకి వస్తోందని వివరణ ఇచ్చారు.

రామప్ప దేవాలయం కురుస్తున్న నేపథ్యంలో అరుదైన రాయితో త్వరలో మరమ్మతులు చేయించేందుకు కేంద్ర పురావస్తు శాఖ యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో ఆ రాళ్లు కదలకుండా ఐరన్ క్లిప్‌లను కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. ఈ పనుల కోసం రూ.16లక్షలు ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేశారు. వర్షంతో ఆలయం కురుస్తున్న నేపథ్యంలో ఈ సమస్యను అరికట్టేందుకు పురావస్తుశాఖ సజ్జల్‌స్టోన్స్ (రాళ్ల) కోసం మూడు నెలలుగా ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. ఆమధ్యకాలంలో అనంతపురంలోని ఓ ప్రదేశంలో ఈ తరహా రాళ్లు లభ్యమవుతున్నట్లు సమాచారం. నీళ్లు రావడానికి కారణమైన సజ్జల్ స్టోన్స్‌ను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేందుకు 2022 ఏప్రిల్‌లో టెండర్లను పిలిచినా ఎవరూ రాకపోవడం వల్ల ఈ పనులు నిలిచిపోయాయని అధికారుల ద్వారా తెలిసింది. రానున్న రెండునెలల్లో ఈపనులు పూర్తి చేసి రామప్ప ఆలయంలోకి నీటిచుక్క రాకుండా శాశ్వత మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పురావస్తుశాఖ సన్నద్ధమవుతోంది. 25 సజ్జల్ స్టోన్స్ అవసరం ఉన్నాయని, ఒక్కో స్టోన్ మీటరుకు రూ.25వేల వరకు ఉంటుందని అంటున్నారు. ఈస్టోన్స్ ఏర్పాటు చేశాక మరోదఫా ఇలాంటి సమస్య తలెత్తకుండా ఆలయం పైభాగాన్ని మొత్తం ఐరన్‌క్లిప్‌లతో కదలకుండా మరమ్మతులు చేయనున్నారు.

కురవడం లేదట!

కాకతీయుల కళా ప్రతిభకు నిదర్శనమై యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ రామప్ప ఆలయం, గర్భాలయం, మండపంలోని నాలుగు స్తంభాల నుంచి 2013-14లో నీళ్లు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అప్పటి నుంచి రామప్ప పైభాగం నుంచి నీళ్లు రావడంలేదు. పురావస్తు శాఖ అధికారుల బృందం 2013లో రామప్పలో పర్యటించి నిచ్చెన సహాయంతో ఆలయంపై భాగానికి వెళ్లి అక్కడి నుంచి నీరు వచ్చే ప్రసక్తే కనబడటం లేదని అప్పటి పురావస్తుశాఖ అధికారి స్మిత ఎస్.కుమారి వివరణ ఇచ్చారు. అయితే.. రామప్ప ఆలయం మూడు వైపులా తెరిచి ఉండటంతో వచ్చే ఈదురుగాలులకు, వర్షపు చినుకులు ఆలయంలో పడుతున్నాయని, ఇలా లోపలికి నీరు చేరుతున్నాయని అంటున్నారు. రానున్న రోజుల్లో ఈ తరహా ఇబ్బందులు కూడా జరగకుండా చర్యలు తీసుకునేందుకు పురావస్తు శాఖ సన్నద్ధమవుతోంది.



రామప్ప దేవాలయం

సర్కారు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

భూపాలపల్లి డీఈవో రాజేందర్



మొగుళ్లపల్లిలో మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

మొగుళ్లపల్లి, జూలై 20: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని భూపాలపల్లి డీఈవో రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. అనంతరం కాలిన్సుపరువు స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధులు రామారావు, సాగర్, ప్రవీణ్‌లు పాఠశాలకు నాలుగు కంప్యూటర్లను బహూకరించగా డీఈవో అభినందించారు. ఈ సమావేశంలో సీఎంవో సామల రమేష్, ఎంఈవో ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌పాల్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తిరుమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

చిట్యాల: పిల్లలు చదువులో సామర్థ్యాలను పెంచుకోవడంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని డీఈవో రాజేందర్ అన్నారు. మండలంలోని జూకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ రమేష్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను అభినందించిన హర్యానా గవర్నర్

ములుగు, జూలై 20: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్యను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు. వాజేడు మండలంలోని పెనుగోలు ఆదివాసీ గూడానికి వాగులు, గుట్టలు దాటుతూ 16 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అక్కడి గిరిజనులకు వైద్య అందించడమే కాకుండా దోమతెరలు, నిత్యావసరాలను పంపిణీ చేయడం పట్ల ప్రశంసించారు. శనివారం మధ్యాహ్నం అప్పయ్యకు ఫోన్‌చేసిన గవర్నర్ దత్తాత్రేయ కొద్దిసేపు మాట్లాడారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటుకుంటూ అడవిదారి గుండా వెళ్లడమే కాకుండా ఒకరోజు అగూడెంలో గడిపిన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. వృత్తిపట్ల నిబద్ధత, పేదల పట్ల బాధ్యతను కనబర్చావంటూ అభినందించారు. తాను హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కలుస్తానని చెప్పారు. స్వయంగా గవర్నర్ దత్తాత్రేయ తనకు ఫోన్ చేసి అభినందించడం పట్ల డీఎంహెచ్‌వో అప్పయ్య ఆనందం వ్యక్తం చేశారు. వృత్తిధర్మాన్ని పాటించిన తనకు ఆయన ప్రశంసలు స్ఫూర్తినిచ్చాయన్నారు.

మంత్రుల పర్యటన రద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 20: భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆదివారం మంత్రులు రావాల్సి ఉండగా ఆ పర్యటనను రద్దు అయినట్టు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం తెలిపారు. ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో భూపాలపల్లిలోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గోరికొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో భవన నిర్మాణాలకు, గణపురం మండలం మైలారం గుట్టల్లో ఇండస్ట్రీయల్ పార్కుకు శంకుస్థాపన చేసేందుకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క రావాల్సి ఉండగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వారి పర్యటనను రద్దు అయ్యిందని వివరించారు. త్వరలోనే మంత్రుల పర్యటన వివరాల తేదీని ప్రకటిస్తామన్నారు.

రుణమాఫీ ప్రక్రియను పర్యవేక్షించండి..

బ్యాంకు అధికారులతో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 20: రుణమాఫీ ప్రయోజనాలు సంపూర్ణం అయ్యేలా నిత్య పర్యవేక్షణ జరపాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులను ఆదేశించారు. శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుఅధికారులు, సహకార సంఘాల ప్రతినిధులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రుణమాఫీప్రక్రియ అమలు, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం, సమస్యలు, పరిష్కార చర్యలు తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు రవీందర్‌రావు దిశా, నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం చారిత్రక ఘటమన్నారు. రైతులకు ఖాతాల్లో జమ అయ్యే చర్యలు వేగవంతం చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాక ఇతర ఖాతాల కింద ఆ డబ్బులను తీసుకోవద్దని సూచించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి కారణాలు విశ్లేషించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సమీక్ష నిర్వహణలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రైతులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా సేవలు అందించాలన్నారు. రుణమాఫీ నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకొని తనకు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీసీసీ బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, కృష్ణమోహన్, గంప స్రవంతి, రాజు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మార్నేని

రుణమాఫీ ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు. శనివారం హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. రుణమాఫీ ద్వారా రైతులకు న్యాయం చేశారంటూ నరేందర్‌రెడ్డిని టెస్కాబ్ చైర్మన్ అభినందించారు.

పాఠశాల పనివేళల్లో స్వల్పమార్పులు

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

లింగాలఘణపురం, జూలై20: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూళ్ల పనివేళలు ఇప్పటిదాకా వేర్వేరుగా కొనసాగుతున్నాయి. కాగా అన్ని పాఠశాలల సమయాలను ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు ఒకే రకంగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో హైస్కూళ్లు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, ప్రాథమిక పాఠశాలలు 9.00 గంటల నుంచి 4.00 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతుండేవి. ప్రస్తుతం అన్ని పాఠశాలలకు ఒకే సమయాన్ని నిర్ణయించారు. అయితే ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో మాత్రం ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించేలా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి. వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఆకాశవాణిలో వెంకయ్యనాయుడితో కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: తెలుగు పద్యాలు ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు వరంగల్ ఆకాశవాణితో పాటు రెండు తెలుగు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని రేడియో కేంద్రాల నుంచి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పరియచ కార్యక్రమం ప్రసారం చేయనున్నామని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేడియోతో మాజీ ఉపరాష్ట్రపతికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తారని తెలిపారు. ఆకాశవాణి విశ్రాంత ఏడీజీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆర్. అనంతపద్మనాభరావు పరిచయకర్తగా వ్యవహరిస్తారన్నారు. శ్రోతులు తప్పకుండా వెంకయ్యనాయుడు పరియక కార్యక్రమం వినాలని రవికుమార్ కోరారు.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడిద్దాం..

భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ నేత ఆజాద్

మహబూబాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు ప్రజాపోరాటాల్లో అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుందామని భారతకమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరిసీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే. ఏఎస్ఆర్) నాయకుడు ఆజాద్ పిలుపు నిచ్చారు. మావోయిస్టు నేత ఆజాద్ పేరిట మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి శనివారం పంపిన పత్రిక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. దేశంలో నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి నేటి వరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం 50 ఏళ్ల ప్రజా యుద్ధం కొనసాగుతుందని చెప్పారు. ఈ పోరాటంలో చారుమజుందార్, కనాయ్‌చటర్జీ అమరులయ్యారని వారి విప్లవోద్యమాన్ని పురోగమిస్తూ అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారని చెప్పారు. గతేడాది ప్రభుత్వ ఘాతుక చర్యల్లో 194 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం

ఏటా జూలై 28న అమరుల దినోత్సవాన్ని జరుపుకుంటామని, పోరాటాల్లో వీర మరణం పొందిన వారికి జోహార్లు అర్పిస్తూ వారి ఆశయసాధన కోసం పునరంకితమవ్వాలని ఆజాద్ అన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ 2047 వరకు బ్రాహ్మణీయ హిందూ రాజ్యం నిర్మించే లక్ష్యంతో సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ల ప్రయోజనాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా ప్రచారాలతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిబంధనలను సరళతరం చేసిందని ఆరోపించారు. దేశ సంపదను దోచుకునేలా వందకు పైగా చట్టాలను సవరించిందని మండిపడ్డారు. అంబానీ, ఆదానీలు లాభాలు పొందడానికి అనేక ఒప్పందాలు కుదుర్చుకుందని విమర్శించారు. దశాబ్దాల పోరాటం తర్వాత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కనీస ప్రజాస్వామ్యత హక్కులు కూడా లేవన్నారు. నయవంచనకు గురిచేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు అధికారంలో నుంచి దించి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, వారు ఆరునెలల్లో అవినీతి, అక్రమాలు, బ్రాహ్మణీయ హిందూత్వంపై పోరాడుతున్న వారిపై దాడులు చేశారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం కలిసి ఎన్‌కౌంటర్లు, అక్రమ కేసుల్లో అమాయకులను అరెస్టు చేస్తుందని ఆజాద్ పేర్కొన్నారు. 2017లో సమాధాన్, 2022లో సూరజ్‌కుండ్ విఫలమయ్యాయని, 2024 జనవరి నుంచి కగార్ ఆపరేషన్ పేరుతో క్రూరమైన దాడులు ప్రారంభించారన్నారు. దానిని ప్రజాఉద్యమాలతో ఓడిద్దామని పిలుపునిచ్చారు.

బాలికపై అత్యాచారయత్నం

నిందితుడిపై ఫోక్సో కేసు

వరంగల్ క్రైం, జూలై 20: వరంగల్ నగరంలో దారుణం చోటుచేసుకుంది ఎనిమిదేళ్ల బాలికపై యువకుడు అత్యాచార యత్నం చేశాడు. ఈ సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో బుధవారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన తల్లికి ఫోన్ చేయాలని ఇంటి సమీపంలో ఉండే సుమన్ అనే యువకుడి వద్దకు వెళ్లిన బాలికను లోపలికి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. చేసే బాలిక ప్రతిఘటించి యువకుడి చేతిని కొరికి బయటికి పరుగెత్తుకొచ్చింది. అనంతరం విషయాన్ని తన తల్లికి సమాచారం ఇచ్చింది. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు సుమన్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవీందర్ ధ్రువీకరించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

76 మంది ఉద్యోగులు స్థాన చలనం

రాంనగర్, జూలై 20: రిజిస్ట్రేషన్ శాఖలో 76 మంది ఉద్యోగులను (సీనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు) బదిలీ అయ్యారు. అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు జిల్లా రిజిస్ట్రార్ రవి, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 13 మంది సీనియర్ అసిస్టెంట్లు, 38 మంది జూనియర్ అసిస్టెంట్లు, 20 మంది అటెండర్లు, 4 క్యాషియర్లు, 1 టైపిస్టు ఉన్నారు. కాగా సీనియర్ అసిస్టెంట్లు అందరు ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా, అక్కడి నుంచి 13మంది వరంగల్‌కు వస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్ వరకు బదిలీ అయిన వారు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 15 కార్యాలయాలకు కేటాయించబడ్డారు. సీనియర్ అసిస్టెంట్లు పొరుగు జిల్లాకు బదిలీ అయ్యారు.

రెవెన్యూశాఖలో...

హనుమకొండ టౌన్: స్పౌజ్, ప్రత్యేక కారణాలతో దరఖాస్తులు చేసుకున్న మల్టీజోన్-1, జోన్-4 పరిధిలో ఉన్న తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మంలో పనిచేస్తున్న తహసీల్దార్ టి. గౌరిశంకర్‌ను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా జోనల్-4 పరిధిలో వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం. రమేశ్‌ను హనుమకొండకు, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న జి. అనురాధను హనుమకొండ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లు బదిలీ

నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నలుగురు డిప్యూటీ తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఎ. లలిత స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్ నుంచి యుఎల్‌సీ వింగ్ హనుమకొండ కలెక్టర్‌కు, బి.సంగీత ఆత్మకూరు మండల ఆఫీస్ నుంచి హనుమకొండ కలెక్టర్ యుఎల్‌సీ వింగ్‌కు, ఎల్.భాస్కర్ మూర్తి హనుమకొండ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ నుంచి ఆత్మకూరు తహసీల్దార్ ఆఫీస్‌కు, కె.సూర్యనారాయణ కలెక్టరేట్ యుఎల్‌సీ వింగ్ హనుమకొండ నుంచి స్పెషల్ కలెక్టర్ ఎల్ఏ వరంగల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బల్దియా పరిధిలో పలువురికి బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 20: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఒకే చోట చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ అధికారి వీపీ గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
పి. సురేష్	వరంగల్ బల్దియా	పరకాల
జె. భీమయ్య నాయక్	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోల్కొండ శ్రీను	వరంగల్ బల్దియా	ఖమ్మం
ఎస్. కరుణాకర్	వరంగల్ బల్దియా	మహబూబాబాద్
శానిటరీ సూపర్‌వైజర్‌ల విభాగంలో..		
మాదాసి సాంబయ్య	వరంగల్ బల్దియా	ఖమ్మం
హెల్త్ అసిస్టెంట్ల విభాగంలో...		
సెగ్గోజు కిరణ్‌కుమార్	వరంగల్ బల్దియా	పరకాల
ఈశ్రం శ్రీను	వరంగల్ బల్దియా	నర్సంపేట
రామ శ్రీధర్	వరంగల్ బల్దియా	మహబూబబాద్
ఎస్. ఎల్లస్వామి	వరంగల్ బల్దియా	ఖమ్మం
గోనెల రవీందర్	వరంగల్ బల్దియా	పాల్వంచ
బి. సంపత్‌కుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
గద్దల శివకుమార్	వరంగల్ బల్దియా	ఇల్లందు
ఎస్. శ్యాంకుమార్	వరంగల్ బల్దియా	మణుగూరు
సీనియర్ అసిస్టెంట్ల విభాగంలో...		
ఇజ్రాయెల్	వరంగల్ బల్దియా	ఖమ్మం

నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీలకు బ్రేక్

వరంగల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న నాలుగో తరగతి ఉద్యోగుల బదిలీల ప్రక్రియను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తిరిగి బదిలీల ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు.

ముసురుకుంది..

(5వ పేజీ తరువాయి)

వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మొగుళ్లపల్లి, టేకుమట్ల ప్రాంతాల్లో పలుచోట్ల రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

● జనగామ జిల్లా అంతటా శనివారం ముసురేసింది. జిల్లాలో పంటకు సరిపడా వర్షాలు ఇప్పటికీ పడలేదు. ఈ తరుణంలో 24 గంటలుగా ముసురు పడడంతో పత్తి పంటకు కొంత ఊరట కల్గినట్టయింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు కారణంగా జిల్లాలోని పాత ఇళ్లకు ప్రమాదం ఏర్పడుతోంది. ఏకధాటిగా కురుస్తున్న ముసురుతో నర్మెట్టలో ఓ పాత ఇంటి గోడ కూలింది. జిల్లా అంతటా శనివారం ముసురుతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా శనివారం 7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా పాలకుర్తి మండలం వావిలాలలో 13.8 మి.మీ, అత్యల్పంగా నర్మెట్టలో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

● మహబూబాబాద్ జిల్లాలో రెండ్రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి పలు మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గార్ల పాకాల వాగు రాంపురం బ్రిడ్జిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాబోయే రెండు, మూడ్రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం సెల్-7995074803 నెంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ 8712656928 నెంబర్‌తో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలు అత్యవసర సమయాల్లో ఈ నెంబర్లకు ఫోన్ చేసి సహాయం తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ కోరారు. గార్ల పాకాల వాగు పొంగుతుండడంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో వాగును పరిశీలించి బారీకేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు బంద్ చేశారు. వాగు పొంగుతుండడంతో రాంపురం, మద్దివంచ, కొత్తతండా, పులిగట్టుతండా, గొల్లచర్ల, రాముతండా, హున్యతండాతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కొత్తగూడ మండలంలో కత్తెర్లవాగు, భూర్కపల్లి, కొత్తపల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. బయ్యారంలో పెద్దచెరువు, గౌరారం కట్టు, తులారం ప్రాజెక్టు అలుగులు పోస్తున్నాయి. పాండవుల గుట్ట జలపాతం జాలువారుతుండడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గూడూరు మండలంలోని భీమునిపాదం జలపాతం జాలువారుతుండడంతో ఇతర జిల్లాల నుంచి పర్యాటకుల సందడి పెరిగింది.

● హనుమకొండ జిల్లాలో మాత్రం ఒక మోస్తరుగా మాత్రమే కురుస్తున్నాయి. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడలేదు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక చేసినప్పటికీ జిల్లాలో భారీగా వర్షాలు కురవలేదు. రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. రాత్రంతా ముసురు పడుతోంది. పగలు వర్షం జాడలు లేవు. జిల్లాలో గత 24 గంటల్లో సరాసరి 16.3 మి.మీ. వర్షపాతం మాత్రమే రికార్డయింది. ఆత్మకూరు, దామెర, కమలాపూర్, హసన్‌పర్తి మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో జల్లులు మాత్రమే పడ్డాయి. పరకాలలో లోటు వర్షపాతం నమోదైంది. తొమ్మిది మండలాల్లో ఇప్పటి సాధారణ వర్షపాతం మాత్రమే రికార్డయింది. భీమదేవరపల్లి, వేలేరు, ఎల్కతుర్తి, ఆత్మకూరు మండలాల్లో మాత్రమే సాధారణం కన్నా కాస్త ఎక్కువ వర్షం పడింది. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి పెద్దగా నీరు చేరలేదు. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా వరినాట్లు ఊపందుకున్నాయి. తుంపర్లు పడుతుండడంతో నేలతడిసి నాట్లకు అనుకూలంగా ఉండడంతో వరి స్వల్పకాలిక రకాలను రైతులు నాటుతున్నారు. బావుల కింద మాత్రం రైతులు దీర్ఘకాలిక రకాలను అప్పటికే వేశారు. సాధారణంకన్నా మించి వర్షం కురవకపోవడంతో వరి, పత్తి సాగులో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 25శాతం మేరకే వరి నాట్లు పడ్డాయి.

● వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు సాధారణం కన్నా 10 నుంచి 15 శాతం మేరకు అధిక వర్షపాతం రికార్డు కావలసి ఉండింది. కానీ సాధారణ వర్షమే పడింది. దీనితో జిల్లాలో చెరువులు, కుంటలు, బావుల్లోకి చాలినంత నీరు చేరలేదు. మూడు రోజులుగా ముసురుపడుతోంది. భారీ వర్షం జాడే లేదు. గురువారం ఒక్క రోజే ఒక మోస్తరు భారీ వర్షం పడింది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 22 నుంచి 25 మి.మీ. వర్షమే పడింది. దాదాపు అన్నిమండలాల్లో ఇప్పటి వరకు సాధారణ వర్షమే కురిసింది. పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ను ఇచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కరిసిన పక్షంలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను అలర్ట్ చేశారు.


మంగపేట మండలం కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరుగుతున్న గోదావరి ఉధృతి

మహదేవపూర్/మంగపేట/ఏటూరునాగారం/వాజేడు,జూలై 20: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా భూపాలపల్లి, ములుగు జిల్లాలో గోదావరి ప్రవాహం పెరిగింది. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, ముక్తీశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమేణా పెరుగుతోంది. సరస్వతి బ్యారేజీ వద్ద గేట్లు తీయడంతో వరద నీరు ఎక్కువ రావడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మానేరువాగు, వంకల నుంచి పెద్ద ఎత్తున గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద చేరుతోంది. శనివారం సాయంత్రం వరకు 8.32 మీటర్ల ఎత్తులో ప్రవాహం నమోదైంది.


మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి వరదపోటుతో కోతకు గురవుతున్న వ్యవసాయ భూములు

మంగపేట మండలంలో..

భారీ వర్షాలకు మంగపేట మండలంలోని వాగులు, వంకలు, ఒర్రెలు, ఇతర జలపాతాల నుంచి వరద నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో శనివారం ఉదయం 8.02 మీటర్ల ప్రవాహం నమోదైంది. సాయంత్రం వరకు రెండు సెంటీ మీటర్లవరకు తగ్గుతూ వచ్చింది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద సాయంత్రం వరకు 8 మీటర్ల దూరం వరకు వరద ప్రవాహం కనిపించింది. ఎగువ ప్రాంతాల్లో బ్యారేజీల వద్ద నీటిని విడుదల చేసినప్పుడు వరద పెరగడం, గేట్లు మూసినప్పుడు తగ్గడం జరుగుతోందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. గోదావరి పెరిగినప్పుడు కమలాపురం, మంగపేట మధ్య వరద పోటుతో వ్యవసాయ భూములు కోతకు గురవుతూ విలువైన భూములు వరదలో కలుస్తున్నాయి.

ఏటూరునాగారం మండలంలో..

భారీ వర్షాలకు తోడు మండలంలోని తుపాకులగూడెంలోని సమ్మక్క - సారలమ్మ గేట్లన్నీ ఎత్తడంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. శనివారం ఉదయం 7గంటలకు 11.730 మీటర్ల నీటిమట్టం ఉండగా మధ్యాహ్నానికి 11.970 మీటర్లకు చేరింది. సాయంత్రం 6 గంటలకు 12.210 మీటర్లకు నీటిమట్టం చేరింది. కాగా పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 14.830 మీటర్లకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

పేరూరు వద్ద..


మండలంలోని పేరూరు వద్ద గోదావరి వేగంగా పెరుగుతోంది. ఎగువన ఉన్న ఇంద్రావతి, సమ్మక్కసాగర్ బ్యారేజీల నుంచి వరద నీరును దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరికి భారీగా వరద నీరు చేరుతోంది. శనివారం ఉదయం 8గంటలకు 12.850 మీటర్ల నీటిమట్టంతో ఉన్న గోదావరి 10 గంటలకు 12.870 మీటర్లు నమోదైంది. మధ్యాహ్నం 1గంటకు 12.880 మీటర్లు, సాయంత్రం 6గంటలకు 13.240 మీటర్లకు చేరుకుంది.

బ్యారేజీలకు కొనసాగుతున్న వరద నీరు

● మేడిగడ్డ బ్యారేజీకి 3.73లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్/కన్నాయిగూడెం, జూలై 20: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. శుక్రవారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 3.10లక్షల క్యూసెక్కులుగా ఉండగా శనివారం సాయంత్రం వరకు 3.73లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బ్యారేజీ 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. శనివారం బ్యారేజీ వద్ద 5 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ 66 గేట్లను ఎత్తి అంతేనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నీటినిల్వ చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.


మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం


సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వస్తున్న వరద నీరు

సమ్మక్క బ్యారేజీలో..

భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని సమక్కసాగర్ బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో బ్యారేలోని మొత్తం 59 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 79.50 మీటర్లు నీటి ప్రవాహం నమోదైంది.

కురుస్తున్న రామప్ప దేవాలయం


రామప్ప దేవాలయంలో సజ్జల్ స్టోన్ నుంచి కారుతున్న వర్షపు చుక్కలు

వెంకటాపూర్(రామప్ప), జూలై 20: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం కురుస్తోంది. తూర్పు, దక్షణం వైపున స్తంభాల నుంచి వర్షం నీరు చుక్కలుగా కారుతోంది. పైకప్పుపై సజ్జల్ స్టోన్‌గా పిలిచే రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి నీరు కారుతున్నట్లు స్పష్టమవుతోంది. ఆలయ సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఈ దృశ్యాలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2022 జూలైలో కూడా భారీ వర్షాలకు ఇదే రీతిన ఆలయం కురిసింది. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పురావస్తుశాఖ అధికారులు హుటాహుటిన రామప్పకు వచ్చి పరిశీలన జరిపారు. నక్షత్రాకార పీఠంపై విచ్చుకున్నట్లుగా నిర్మితమైన ఆలయం పైకప్పు శిథిలం కాలేదని, రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి చుక్కలుగా నీరు కారుతోందని పురావస్తు శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్మితా ఎస్.కుమార్ అప్పుడు వివరణ ఇచ్చారు. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం సందులు వచ్చిన రాళ్లను కలుపుతూ వాటిని పోలిన రాళ్లను ఏర్పాటుచేయాలని యోచించారు. రూ.16లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏపీలో అనంతపురం వద్ద రామప్పకు సరిపోలే రాళ్లను గుర్తించి వాటిని తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే మరమ్మతు పనుల్లో జాప్యం కారణంగా వర్షం కురిసినప్పుడల్లా పైకప్పు నుంచి నీరు కారుతోంది. చివరిసారిగా 2015-16లో డంగుసున్నం, కరక్కాయ, ఇటుకలు, నల్లబెల్లం మిశ్రమంతో పైకప్పుకు మరమ్మతు చేశారు. 800 ఏళ్లనాటి ఈ పురాతన రాతికట్టడం పటిష్టతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభించినా పునరుద్ధరణ, పరి రక్షణ చర్యలలో నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సీపీ

వరంగల్ క్రైం, జూలై 20: రెండు రోజులుగా కమిషనరేట్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా సహాయక చర్యలు అందించేందుకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో వాగులు, చెరువుల నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైసిటీస్ పరిధిలో, గ్రామాల పరిధిలో గతంలో ముంపునకు గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షాలకు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేందుకు ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేయాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఆహా ఏమి రుచి..

నగరంలో టిఫిన్స్‌కు పెరుగుతున్న క్రేజ్

హనుమకొండ టౌన్, జూలై 20: వరంగల్, హనుమకొండ, కాజీపేట (ట్రైసిటీ)లో అడుగు అడుగునా ఉన్న టిఫిన్ సెంటర్లకు ఆదరణ పెరుగుతున్నది. నాణ్యత, రుచి, కస్టమర్ల పట్ల మర్యాద తీరు, వివిధ రకాల వంటకాలతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రధానంగా హనుమకొండ చౌరస్తాలోని పప్పు పూరి, అలంకార్ నెయ్యి ఇడ్లీ, కేయూ క్రాస్‌లో సాంబర్ ఇడ్లీ, ఏకశిలాపార్కు ఎదుట వడ, బొండ, అంబేద్కర్ జంక్షన్, తిరుమల బార్, బొక్కలగడ్డ బ్రిడ్జి, లక్ష్మీ టాకీస్, చౌర్‌బౌళి, చింతల్‌బ్రిడ్జి, బట్టలబజార్ వెంకటేశ్వర్ల టెంపుల్, హంటర్‌రోడ్డు, కాజీపేట బాపూజీనగర్‌బ్రిడ్జి ఏరియాల్లో ఉన్న టిఫిన్ సెంటర్‌లల్లో దొరికే టిఫిన్స్ రుచిగా ఉంటాయని టిఫిన్‌ప్రియులు అంటున్నారు.

ఉరుకులు.. పరుగులు..

ప్రస్తుత జీవనం ఉరుకుల పరుగుల మీద నడుస్తోంది. క్షణం తీరికలేని పనులతో చాలామంది తమ జీవితాలను బీజీగా గడుపుతున్నారు. ఇంట్లో పనులు చేసుకునేందుకు వీలు లేనంతగా పొద్దున నిద్రలో నుంచి లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎవరిపనుల్లో వారు విరామం లేకుండా నిమగ్నమై పోతున్నారు. అలాగే ఉద్యోగరిత్యా సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులకు ఆ సమయానికి ఇంట్లో టిఫిన్ తయారీ కాకపోవడం సమస్యగా మారింది. దీంతో ఇంట్లో తినలేకపోతున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం నగరానికి వచ్చి రూమ్‌లల్లో ఉంటున్న బ్యాచ్‌లర్స్‌కు చాలా మంది బయటదొరికే టిఫిన్ సెంటర్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా వరంగల్ నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నవారు.. నగరం నుంచి వెళుతున్న వారు నిత్యం వేలల్లో ఉంటారు. ఈ క్రమంలో తమ తమ గమ్యస్థానాలకు చేరడానికి, బస్సు, రైళ్లను, వివిధ ప్రైవేటు వాహనాలను అందుకోవడానికి ఇంట్లో నుంచి హడావుడిగా బయలు దేరుతుంటారు. ఈ ఆదరాబాదరాలో ఇంట్లో అల్పాహారం తీసుకోరు. ఈ క్రమంలో నగరంలో అడుగుకొక్కటి వెలసిన టిఫిన్ సెంటర్లలో బ్రేక్ ఫాస్ట్ కానిస్తున్నారు.

రాత్రిళ్లలో కూడా..

రాత్రి వేళల్లో సైతం టిఫిన్ సెంటర్ల జోరు కనిపిస్తుంటుంది. విద్యార్థులు, ఉద్యోగులే కాకుండా కొందరు కుటుంబసమేతంగా బయటికొచ్చి రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్ బండ్ల వద్ద తినడం షరా మామూలైపోయింది. ఇక రాత్రి వేళల్లో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లల్లో ప్రయాణికులకు అక్కడే దొరికే బ్రెడ్ ఆమ్లెట్, వేడి వేడి ఇడ్లీలను ఆహారంగా తీసుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికులు ఒక్కరే కాదు.. పార్టీలు చేసుకొని అర్ధరాత్రి ఫుడ్ కోసం బయటకొచ్చే యువకులకు సైతం వేడివేడిగా దొరికే ఇడ్లీతో పాటు రైల్వేస్టేషన్‌ల సమీపంలో అర్ధరాత్రి దొరికే బ్రెడ్ ఆమ్లెట్‌ను ఇష్టపడి తింటున్నారు. ముఖ్యంగా హనుమకొండ చౌరస్తాలో అర్ధరాత్రి వరకు దొరికే చిన్న సైజ్ ఇడ్లీ ఫేమస్. చౌరస్తా చుట్టూరా ఆస్పత్రుల్లోని రోగులు, వారి బంధువులు, అర్ధరాత్రి బస్సు దిగొచ్చిన కుటుంబాలకు, బ్యాచిలర్స్‌కు చిన్న ఇడ్లీలే పరమాన్నం.

తృణధాన్యాలు వైపు..


కొంతమంది ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తృణధాన్యాలు (మిల్లెట్స్) టిఫిన్స్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. అవి ఎక్కడ ఉన్నా తెలుసుకొని మరీ దూరమైనప్పటికి వెళ్లి తిని వస్తున్నారు. మరి కొంత మంది రుచులు చూడటానికి సైతం సందర్శించి తినేసి వస్తున్నారు. టిఫిన్ ప్రియుల అభిరుచుల తగ్గట్టుగా నగరంలో మిల్లెట్స్ టిఫిన్ సెంటర్స్ పెరిగిపోతున్నాయి. రాగి, సామలు, కొర్రలు, క్యారెట్‌లతో ఇడ్లీ, దోశ, పూరీలు చేసి వేడి వేడిగా అందిస్తున్నారు.

వాకర్స్ కోసం..

మార్నింగ్ వాక్‌లోనే రాగి, కొర్రలు, సామలతో తయారుచేసిన జావను టిఫిన్‌గా తీసుకొని రోజువారీ పనిలో భాగంగా ఎవరి పనులకు వారు వెళుతున్నారు. ప్రతీ గ్రౌండ్‌లో వాకింగ్‌కు ముందు ఈ జావాలు తీసుకోవడం సాధారణమైపోయింది. అయితే పబ్లిక్‌గార్డెన్ దగ్గర బొక్కలసూప్‌కు ప్రత్యేకత ఉంది. వివిధ పనుల కోసం పొద్దునే బయటికి వచ్చే వారితో పాటు వాకర్స్ దానినేబ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటున్నారు.

ఉదయాన్నే డ్యూటీకొస్తా..


ఈ.మాధవ్‌రావు, ట్రాఫిక్ పోలీస్



ఉదయం 8గంటల వరకు విధుల్లో చేరాలి. 7.40నిమిషాలకు పోలీస్‌స్టేషన్‌లో రూల్‌కాల్ ఉంటుంది కాబట్టి ఉదయాన్నే ఇంట్లో నుంచి డ్యూటీకి బయలుదేరుతాను. ఆ సమయంలో ఇంట్లో టిఫిన్ సిద్ధం కాదు. రూల్ కాల్ తర్వాత లేదా కొంత సమయం తర్వాత డ్యూటీ చేసే సిగ్నల్ పాయింట్ దగ్గర ఉన్న ఏదో ఒక టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేస్తాను.

ఇంట్లో టిఫిన్ చేసే సమయం ఉండదు..

రాచమల్ల రవీందర్, బిల్డర్



వృత్తిరిత్యా బిల్డర్ కావడంతో ఉదయాన్నే పని వాళ్లు వచ్చేలోపు నిర్మాణ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. పక్క జిల్లాలో పనులు ఉంటే ఇంట్లో నుంచి ఉద యం 8గంట లకే అక్కడికి బయలు దేరుతాను. మధ్యాహ్న భోజనం తీసుకెళతా.. టిఫిన్ మాత్రం మార్గమధ్యలో చేస్తా..

రోజూ బయటనే టిఫిన్ చేస్తా..

మాడిశెట్టి శ్రీను. ప్రైవేట్ ఉద్యోగి

వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. రోజూ గీసుగొండ మండలం నుంచి బైకుపై వస్తుంటాను వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో టిఫిన్స్ చేయరు. పొద్దున్నే అన్నం వండటంతో లంచ్‌బాక్స్‌తో బయలుదేరుతాను. ఉదయం వరంగల్‌లో టిఫిన్ చేస్తాను. లక్ష్మీటాకీస్ సమీపంలో బోండా భలే రుచిగా ఉంటుంది.

పొంగిన వాగులు.. వంకలు



వరద నీరుతో ప్రవహిస్తున్న మేడారంలోని జంపన్న వాగు

మంగపేట, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో మండలంలోని చెరువులు, కుంటలు తిరిగి మత్తడిపోస్తున్నాయి. మల్లూరు అత్తచెరువుకు శనివారం ఉదయం అలుగుపడింది. మిగతా గ్రామాల్లో కూడా చెరువులు, కుంటలు నిండిపోయాయి. మల్లూరు మొట్లగూడెం, శనిగకుంట మధ్య ఉన్న కూడలవాగుపై నిర్మించిన లోలేవల్ వంతెన నుంచి చెరువు నీరు రావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొత్తూరు మొట్లగూడెం, బోమ్మాయిగూడెం మార్గ మధ్యలోని గౌరారం వాగు లోలేవల్ వంతెనపై వరద నీరు చేరడంతో రెండు గ్రామాలకు రాకపోకలకు సుమారు ఐదు గంటల పాటు అంతరాయమం ఏర్పడింది. గోదావరి, వాగులు, ఒర్రెలు పెరుగడంతో పాటు లోతట్టు ప్రాంతాలకు నీరు భారీగా చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో స్థానిక ఎంపీడీవో జి. కృష్ణప్రసాద్, మండల ప్రత్యేక అధికారి తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, మంగపేట ప్రొబేషనరీ ఎస్సై సురేష్ పర్యటించారు.లోతట్టు ప్రాంతాలైన శనిగకుంట, బోమ్మాయిగూడెం, అకినేపల్లి-మల్లారం, ఎస్టీ కాలని, కత్తిగూడెం తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

• వాజేడు: మండలంలో ఎడతేరిపిలేకుండా రోజంతా వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. జలపాతం ముందు భాగంలో ఈత కొలనుకు వరద నీరు భారీగా చేరింది. దీంతో ఈత కొలనులోకి పర్యాటకులను ఫారెస్టు అధికారులు అనుమతించడంలేదు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, నాబబ్ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్‌ఐ కుమారస్వామీ మండలంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. అరుణాచలపురం చెరువు, కొప్పుసూరులో ఉన్న గుండ్లవాగు ప్రాజెక్టులను పరిశీలించారు. పలు చోట్ల నిల్వ ఉన్న వరద నీటిని తొలగించేందుకు తూములు ఏర్పాటు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావద్దని, చేపల వేటకు వెళ్లొద్దని, వాగులు, చెరువులు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

• మేడారం: తాడ్వాయి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మేడారం జంపన్నవాగులో వర్షం నీరు చేరి వరద ఉధృతి పెరిగింది. ఉదయం నుంచి సాయత్రం వరకు సుమారు ఐదు అడుగులకు పైగా నీటిమట్టం నమోదైంది. దీంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

• ఏటూరునాగారం రూరల్ : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ తడసి ముద్ద అయ్యింది. మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని బానాజీబంధం- ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాలకురాకపోకలు నిలిచిపోయాయి. పడవ సహాయంతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి- తాడ్వాయి గ్రామాల మధ్య 163వ జాతీయ రహదారిపై వర్షాలకు భారీ వృక్షం రోడ్డుపై పడగా వాహనాల రాకపోకలను అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై తాజుద్దీన్‌తన సిబ్బందితో కలిసి రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించిన రవాణాను పునరుద్ధరించారు. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతి కొనసాగుతోంది. అలాగే కొండాయి గ్రామానికి చెందిన వృద్ధురాలు మాదరి పోచమ్మకు ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురికాగా ఆమెను మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకురావడానికి ప్రయత్నించారు. దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎన్డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు ఎయిర్ బోట్ సహాయంతో ఆమెను వాగు దాటించి 108 వాహనంలో మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు.

• మహ దేవపూర్: మండల కేంద్రానికి చెందిన గోగుల రాకేష్ అనే వ్యక్తి ఇంటి గోడలు వర్షానికి కూలిపోయాయి. చేనేత కుటుంబానికి చెందిన రాకేష్‌కు ఇల్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. గోడలు కూలి తనకు ఉపాధినిచ్చే మగ్గం ధ్వంసం కావడంతో ఆవేదన చెందాడు. ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

• మల్హర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రెండు జిల్లాల సరిహద్దు పీవీనగర్ వద్ద మానేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురిసిన వర్షాల వల్ల మల్లారం అరెవాగు ప్రవాహం పెరిగింది. కొయ్యూర్ వద్ద బొగ్గులవాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. పీవీనగర్, కుంభంపల్లి, వల్లెంకుంట గ్రామంలోని ఊర చెరువును తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పరిశీలించారు. మానేరు, అరెవాగు పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. వరద ముప్పు పొంచి ఉన్న గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

• కన్నాయిగూడెం: వర్షాలకు ఐలాపూర్ గ్రామం చుట్టూ ఉన్న చిందోని వాగు, కోర్ల వాగు, సుద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఐలాపూర్‌కు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సర్వాయి బుట్టాయిగూడెం దారిలో ఉన్న లోలెవల్ వంతెన మీది నుంచి వరద పారుతోంది. కంతనపల్లి-బంగారుపల్లి రహదారిలో ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహించటతో గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు.

• తాడ్వాయి: మండల వ్యాప్తంగా నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తాడ్వాయి- మేడారం మార్గమధ్యంలో రోడ్డుపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో మేడారం వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, కొంతమంది యువకులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

• మహదేవపూర్ రూరల్: మారుమూల అటవీ మండలమైన పలిమెలలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పర్యటించారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో వరదల పట్ల ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరదలు సంభవిస్తే చేపట్టాల్సిన సహాయక చర్యలపై క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే పర్యటించినట్లు తెలిపారు. పలిమెల మండలంలోని దమ్మూరు గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో గిరివికాస్ పథకం ద్వారా మంజూరైన బోర్లకు త్రీపేజ్ విద్యుత్ సరఫరా రావడంలేదని ఈ సందర్భంగా గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పలిమెల మండల కేంద్రంలో రూ.65లక్షల వ్యయంతో నిర్మించే సమీకృత భవనం, రూ.1.43కోట్లతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలకు ఇప్పటికే టెండర్లు పిలిచామని, త్వరలోనే ఆ పనులు ప్రారంభమవుతుయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు మండల కేంద్రంలోనే ఉండేలా వారి నివాసాల కోసం స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక వర్షాపాతం నమోదవుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలు సంభవిస్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 10మంది సుశిక్షితులైన సిబ్బంది, వాటర్ బోట్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా మహదేవపూర్ మండలంలోని పెద్దంపేట వాగుపై ఉన్న వంతెనను కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. పెద్దంపేట వద్ద గోదావరి నదిలో వాటర్‌బోట్లు పరిశీలించారు. వరద ప్రవాహం అధికమైతే వెంటనే రంగంలోకి దిగి ప్రమాదం తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వారివెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ఏఈ డీఈ సాయిలు, ఎస్సైలు పవన్‌కుమార్, తమాషారెడ్డి తదితరులు ఉన్నారు.

• కాటారం : మండలంలో శుక్రవారం రాత్రి, సోమవారం ఎడతెగకుండా కురిసిన వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షంతో గోపాల్‌పూర్‌వాగు, అలుగువాగు, బొర్రవాగు, పెద్దవాగులు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. గుమ్మళ్లపల్లి సమీపంలోని మైసమ్మకుంట తూము వద్ద పెద్ద బుంగపడటంతో పొలాలు, పత్తిచేలల్లోకి వరదనీరు చేరింది. రేగులగూడెం జీపీ పరిధిలోని గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగడంతో పంట పొలాలన్నీ వరదనీటిలో మునిగాయి. పొలాలు చెరువును తలపిస్తున్నాయి. ఇసుక మేటలు వేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షానికి శంకరంపల్లిలో శ్రీనివాస్ ఇంటిపైకప్పు కుప్పకూలింది. చల్ల తిరుపతి ఇంటి గోడ కూలింది. గోపాల్‌పూర్, దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి, శంకరంపల్లి, రేగులగూడెం, దేవరాంపల్లి, ధన్వాడ, బొప్పారం, పోతులవాయి తదితర గ్రామాల పరిధిలో వరదనీరు ముంచెత్తడంతో పత్తి పంట, వరి నార్లు, కూరగాయల తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాదరావుపేట సమీపంలో వరదనీరు ముంచెత్తడంతో వంతెన వద్ద తారురోడ్డు కోతకు గురై భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. భారీ వర్షాలు, వరద పరిస్థితిని పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సీఐ నాగార్జునరావు, ఎంఎస్‌వో సంజీవరావు, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్, ఎంపీవో ఉపేంద్రయ్య పలు వాగుల ఉధృతిని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. సీఐ, ఎస్సైలు వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు గ్రామాల్లో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.

• టేకుమట్ల: ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షం దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రాకూడదని ఎస్సై ప్రసాద్ సూచించారు. మండలంలోని చలివాగు, మానేరులలో నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. వర్షాలకు వాగులు, చెరువులు, జలశయాలు తెగిపోయే అవకాశాలుంటాయని, వాటిని దాటే ప్రయత్నం చేయొద్దని అన్నారు.

వర్షం పడిందిలా..

ములుగు/భూపాలపల్లిటౌన్, జూలై 20 : ములుగు జిల్లాలో సగటు వర్షపాతం 30 మి.మీటర్లు నమోదైంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో కురిసిన వర్ష తీవ్రతను పరిశీలిస్తే.. అత్యధికంగా కన్నాయిగూడెం మండలంలో 43.8మి.మీ వర్షం కురిసింది. తాడ్వాయిలో 32మి.మీ, వాజేడులో 26మి.మీ, వెంకటాపూర్(రామప్ప)లో 19.8మి.మీ, ఏటూరునాగారంలో 19.3మి.మీ, మంగపేటలో 11.5మి.మీ, ములుగు మండలంలో 9.0మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడురోజులు జిల్లాకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన చేస్తూ వాతావరణ శాఖ ప్రకటన జారీచేసింది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వరినాట్లు జోరుగా సాగుతున్నాయి.

భూపాలపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 25.8 మిల్లీ మీటర్లు నమోదైంది. మహదేవపూర్ 21.8, పలిమెల 2.4, మహాముత్తారంలో 26.8, కాటారం 31.4, మల్హర్ 23.2, చిట్యాల 36, టేకుమట్లలో 29.4, మొగుళ్లపల్లి 19.2, రేగొండ 40, గణపురంలో 32.8, భూపాలపల్లి 21.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి

ములుగు, జూలై 20: భారీ వర్షాలు, వరద హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. 80 ముంపు ప్రాంతాలను గుర్తించి 135 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. 2 వేల మంది ప్రజలను తరలించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని పేర్కొన్నారు. అయితే శిథిలావస్థకు చేరిన గృహాలలో నివసించే వారు ఖాళీ చేయాలని సూచించారు. ప్రసూతికి దగ్గరగా ఉన్న గర్భిణులు, అత్యవసర వైద్యం అవసరమైన వారు ముందే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. గోదావరిలో ప్రవాహం క్రమంగా పెరుగుతోందని, వాగులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈసమయంలో చేపల వేటకు వెళ్లడం అత్యంత ప్రమాదకరమన్నారు. రీల్స్, ఫొటోల కోసం యువత వరద వద్దకు వెళ్లవద్దని సూచించారు. సహాయక చర్యల కోసం అధికార యంత్రాంగానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే ఏటూరునాగారం ఐటీడీఏలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా ములుగు కలెక్టరేట్‌లో కూడా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సహాయం, సమాచారం కోసం 1800-4257109 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 20: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను అందుబాటులోకి తెచ్చారు.



కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హన్మంతుల వాగు



పలిమెల మండలం దమ్మూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

మల్లూరు ప్రాజెక్టుకు జలకళ

మంగపేట: జూలై 20: మండలంలోని నర్సింహసాగార్ శివారు మల్లూరు వాగుపై నిర్మించిన మధ్యతరహా ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. శనివారం 5.5 మీటర్ల లోతు వరకు వర్షపు నీరు చేరింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మల్లూరువాగు, పులుసుబొంతవాగు, వట్టివాగు నుంచి వర్షపు నీటితో పాటు ఒర్రెలు, వంకల నుంచి చేరిన వరద ప్రాజెక్టులోకి చేరుకుంది. ఎండాకాలం వరకు పూర్తిగా బోసి పోయిన ప్రాజెక్టు ఉండగా శనివారం సాయంత్రం వరకు నిండుగా కనిపించింది. ఈ ప్రాజెక్టుకు 115.25 మీటర్ల నీరు చేరితే మత్తడి పడుతుంది. ప్రస్తుతం 112.75 మీటర్ల వరకు నీరు చేరింది. వర్షాలు ఇలా కురిస్తే ఇంకా 3 మీటర్ల వరకు నీరు ప్రాజెక్టులోకి చేరితే అలుగుపోసే అవకాశం ఉందని ఇరిగేషన్ ఏఈ వలీ మహ్మద్ తెలిపారు. మత్తడికి చేరువలో ఈ ప్రాజెక్టు ఉందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కింద అధికారికంగా 7,500 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడి కాల్వ కింద 4,100 ఎకరాలు, ఎడమ కాల్వ కింద 3,400 ఎకరాలు పంటలు పండే అవకాశం ఉంది. అనధికారికంగా కుడి, ఎడమ కాల్వల కింద సుమారు 15 వేల ఎకరాల సాగు జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మల్లూరు మధ్య తరహా ప్రాజెక్టుకు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నీరు లీకై వృథాగా పోకుండా ఉంటే రెండు పంటలు సమృద్ధిగా పండుతాయని అంటున్నారు. ఇంజనీరింగ్ అధికారులు నీటి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.



మల్లూరు ప్రాజెక్టులో వరద నీరు



వాజేడు మండలంలో ఉధృతంగా పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం



ఏటూరునాగారం మండలంలో దొడ్ల- మల్యాల గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర



ఇంటిగ్రేటెడ్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గణపురం, జూలై 20: మండలంలోని గాంధీనగర్ శివారులో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాట్ల పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రదేశంలో జరుగుతున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైలారం ప్రభుత్వం పాఠశాల వెనుకాల ఉన్న మల్లికార్జునస్వామి దేవాలయం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, ఇండస్ట్రియల్ జీఎం రవి ఉన్నారు.

మైన్స్ సేఫ్టీ కమిటీ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న మైన్స్ సేఫ్టీ కమిటీ చైర్మన్ వెంకన్న

కాకతీయఖని, జూలై 20: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ గనిని ఆలిండియా మైన్స్ సేఫ్టీ అవార్డ్ కమిటీ శనివారం తనిఖీ చేసింది. కమిటీ చైర్మన్ వెంకన్న(డీడీఎంఎస్ మైనింగ్ సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్) నేతృత్వంలో కమిటీ సభ్యులు అనురాగ్ శేఖర్ దూబే, రవీంద్ర పి.గత్వార్, మనోరంజన్ మహోలి, సురేష్‌మూర్తి, రితేష్ పరిశీలించారు. వారి వెంట ఏరియా సింగరేణి అధికారులు వెంకట్రామిరెడ్డి, జీఎల్ ప్రసాద్, రాజశేఖర్, చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

సింగరేణి ఆస్పత్రితో బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్

కాకతీయఖని, జూలై 20: సింగరేణి ఆధ్వర్యంలో ఉచితంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంప్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఏరియా సింగరేణి ఆస్పత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్ ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీ కలిగిన డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. 45 ఏళ్ల పైబడిన సింగరేణి మహిళా ఉద్యోగుల, ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసం బెస్ట్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో డాక్టర్ పద్మజ, అధికారులు వెంకట్రామిరెడ్డి, అజ్మీర తుకారాం, సురేఖ, భిక్షమయ్య, బాలరాజు, శ్యామ్‌ప్రసాద్, వైద్యులు శ్రావణికుమారి, సురేష్, గోపీకృష్ణ, సేవా అధ్యక్షురాలు సయ్యద్ జామాబేగం, యూనియన్ నాయకులు మోటపలుకుల రమేష్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మునిసిపల్ వైస్ చైర్మన్ వితరణ

భూపాలపల్లిటౌన్, జూలై 20: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి భూపాలపల్లి మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. భూపాలపల్లి పట్టణంలోని జడ్పీ హెచ్ఎస్‌లో తల్లిదండ్రులకు పాఠశాల ప్రధానోపాధ్యా యులు, అమ్మ కమిటీ ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హరీశ్‌రెడ్డి హాజరాయ్యరు.పాఠశాలలో పలు సమస్యలు నెలకొన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరగా తనవంతుగా రూ.10వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అమ్మకమిటీ చైర్మన్ వాసాల స్వప్న, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా చేయించుకోవాలి

వెంకటాపురం(నూగూరు), జూలై 20: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 30లోగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుబీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి గుంటక నర్సింహారావు శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, నామినేషన్ చేసే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేయాలని పేర్కొ న్నారు. రుణమాఫీ అయినందున రైతులు సంబంధిత బ్యాం కుకు వెళ్లి రెన్యువల్‌కు సంబందించిన ప్రతులు, అడంగల్ పహణీ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు అందజేసి రుణమాఫీలో వచ్చిన సొమ్మును తీసుకోవాలని సూచించారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

తాడ్వాయి, జూలై 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికా రులు అర్షం రాజు, సాంబయ్యలు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అందులో భాగంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, రెండు జతల యూని ఫాం, మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు మూత్ర శాలలు, మరుగుదొడ్లు, విద్యుత్, మంచినీరు, డిజిటల్ తరగతుల నిర్వహణ ఉచితంగా కల్పిస్తుందని అన్నారు. గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థాయిలో గల అమ్మ ఆదర్శ పాఠ శాల కమిటీలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రతినెలలో జరిగే సమావేశానికి తల్లిదండ్రులు తప్పకుండా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కొట్టె మల్లికాంబ, ప్రధానోపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి కేశవరావు, ఎంపీపీఎస్ హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీ ఆత్మహత్య

కాటారం, జూలై 20: తాపీ మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని ఇప్పలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామంజపూర్ గుంటూరుపల్లికి చెందిన ధర్మల వెంకటమల్లు అలియాస్ వెంకట్(38) భార్య ఇందు, పిల్లలు అఖిల, చిన్నితో కలిసి ఆరేళ్ల క్రితం పరకాలకు వలస వెళ్లాడు. అక్కడే తాపీ పనులు చేస్తుండగా సంవ త్సరన్నర క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పిల్లలు అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లిపోగా ఆరు నెలల క్రితం వెంకట్ భవన నిర్మాణ పనులు చేయడానికి కాటారం మండల కేంద్రానికి వచ్చి కిరాయి ఇంట్లో ఉంటు న్నాడు. ఓ వైపు భార్య చనిపోవడం, పిల్లలు అమ్మమ్మ వాళ్లింట్లోనే ఉండ టంతో ఒంటరిగా ఉంటున్న వెంకట్ మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రెండో ఏఎన్ఎంల రాస్తారోకో

కాటారం, జూలై 20: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు రాస్తారోకో చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన మహాముత్తారం రెండో ఏఎన్ఎం చిడెం ముత్తక్క కుటుంబానికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ వర్షంలో తడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ 17ఏళ్లుగా రెండో ఏఎన్ఎంలు విధులు నిర్వర్తిస్తూ వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారుతున్నా రెండో ఏఎన్ఎంల బతుకులు మారడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముత్తక్క కుటుంబానికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు సరళ, శ్యామలత, పార్వతి, విజయ, సునిత, సుజాత, భారతి, సంధ్య, వెంకటమ్మ, స్వప్న, రజిత, అనసూయ, శ్రీలత, యాదలక్ష్మి, దీనా, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నేతలు

ముత్తక్కకు టీపీసీసీ కార్యదర్శి నివాళులు

మహాముత్తారం మండలంలో రెండో ఏఎన్ఎంగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన చిడెం ముత్తక్క మృతదేహానికి టీపీసీసీ మహిళా కార్యదర్శి ఆంగోత్ సుగుణ నివాళులర్పించారు. ముత్తక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

ములుగు కలెక్టరేట్, జూలై 20: హైదరాబాద్‌లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై నిర్వహించిన మహాధర్నాకు తరలివెళకుండా ములుగు పోలీసులు శనివారం ముందస్తుగా బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు మాట్లాడుతూ మహాధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినా ముందస్తు అరెస్టు చేయడం దివాలాకోరు తనానికి నిదర్శమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించేవారిని అణగదొక్కాలని చూడడం సరికాదని అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు అందించాలని, 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని , గ్రూప్-1లో 1:100 పద్ధతి ద్వారా సెలెక్ట్ చేయాలని, గ్రూప్-2,3లలో 3వేల పోస్టుల చొప్పున పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని, 2లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రి యను వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కల్లెపు ప్రవీణ్, నాయకులు బోగిరి రాకేష్, ఇనుముల మహేష్, ఎల్కతుర్తి శివ, సాయి, రంజిత్, ఇర్సవడ్ల సాయి, తదితరులు ఉన్నారు.